

వైభవంగా వెండి రథోత్సవం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల భ్రమరాంబా మల్లికార్జునస్వామి వార్లకు సోమవారం వెండి రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ముందుకు సహస్రదీపార్చన జరిపారు.



అలరించిన నృత్యప్రదర్శన

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల ఆలయ నిత్యకళావేదికపై సోమవారం నంద్యాలకు చెందిన సాయి నాట్యంజలి కూచిపూడి కళాక్షేత్రం వారు నిర్వహించిన సంప్రదాయ నృత్యప్రదర్శన ఆకట్టుకుంది.



కలప వేలం

రుద్రవరం: స్థానిక కలప డిపోలో సోమవారం టేకు,నండ్ర, బిండుగ, నీలగిరి దుంగలతో పాటు ఎద్దుల బండి,వెదురు బొంగులు,కర్రలకు అటవీ శాఖ అధికారులు వేలం నిర్వహించారు.

న్యూస్‌రీల్

9న జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు



కర్నూలు(అర్బన్): జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలను ఈ నెల 9వ తేదీన తన చాంబర్‌లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు జెడ్పీ సీఈఓ జీ నాసరరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి ఆదేశాల మేరకు ఈ సమావేశాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామీణాభివృద్ధి, వ్యవసాయం, సాంఘిక సంక్షేమం, విద్య, వైద్యం, మహిళాభివృద్ధి, శిశు సంక్షేమం, ఆర్థిక ప్రణాళిక, పనులు తదితర అంశాలపై సమీక్ష నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆయా శాఖలకు చెందిన అధికారులు, స్థాయీ సంఘాల సభ్యులు నిర్ణీత సమయానికి సమావేశాలకు హాజరు కావాలని సీఈఓ కోరారు.

నేడు హజ్ యాత్రికులకు ప్రత్యేక వ్యాక్సినేషన్

కర్నూలు(హాస్పిటల్): హజ్‌కు వెళ్లే యాత్రికులకు మంగళవారం ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లోని వడ్డేగేరి పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రత్యేక వ్యాక్సినేషన్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. హజ్ యాత్రికులకు మెనింగోకాకల్, ఇన్‌ఫ్లుయింజ, ఓపీవీ, ఓరల్ పోలియో వ్యాక్సిన్లు ఉచితంగా వేస్తారని పేర్కొన్నారు. వారికి అవసరమైన వైద్యపరీక్షలు కూడా నిర్వహిస్తారని తెలిపారు. హజ్ యాత్రికులు ఈ శిబిరానికి హాజరైన సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కర్నూలు @45.3

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి కర్నూలు జిల్లాలో సోమవారం కర్నూలు నగరంలో అత్యధికంగా 45.3 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. డోన్‌లో 45.2, కల్లూరులో 44.9, నందికొట్కూరులో 44.6, మహానందిలో 44.2, బండిఆత్మకూరులో 43.7, కొత్తపల్లిలో 43.6, బనగానపల్లెలో 42.3, గూడూరులో 42.1 డిగ్రీల ప్రకారం ఉష్ణోగ్రలు నమోదయ్యాయి. కర్నూలు జిల్లాలో రెండు, నంద్యాల జిల్లాలో ఆరు మండలాల్లో హీట్‌వేవ్ నమోదైంది. రానున్న రోజుల్లో కూడా వడగాల్పుల తీవ్రత కొనసాగే అవకాశం ఉంది.

పాలన పారదర్శకంగా ఉండాలి.. అవినీతి, అక్రమాలకు చోటివ్వకుండా పథకాలు అమలు చేయాలి.. ప్రజల జీవన ప్రమాణాలు పెంచే విధంగా కార్యక్రమాలు నిర్వహించాలి. అయితే టీడీపీ అధినేత చంద్రబాబు తన పాలనా కాలంలో కేవలం పార్టీ నాయకులు, కార్యకర్తల కోసమే పథకాలు అమలు చేశారనే విమర్శలు ఉన్నాయి. ప్రజాధనాన్ని తన అనుచర వర్గానికి దోచిపెట్టారనే ఆరోపణలు ఉన్నాయి. ఇందుకు ఉమ్మడి కర్నూలు జిల్లాలో అమలు చేసిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని నిదర్శనంగా చూపుతున్నారు. టీడీపీ హయాంలో ఐదేళ్లు కేవలం 'ఉపాధి' పనుల్లోనే రూ. వెయ్యి కోట్ల మేర అవినీతి జరిగిందంటే అక్రమాలు ఏ స్థాయిలో ఉన్నాయో ఊహించుకోవచ్చు. పేదల కడుపుగొట్టి.. టీడీపీ శ్రేణుల బొజ్జలు నింపే అలాంటి పాలన మళ్లీ వద్దు అని ప్రజలు బహిరంగంగానే చెబుతున్నారు. ప్రజాహితాన్ని కోరుతూ సుపరిపాలన అందించే వారికే తాము ఓటు వేస్తామని స్పష్టం చేస్తున్నారు.



'ఉపాధి'ని చెరిపేసి.. బాబు రాసిన అవినీతి గీతం!

- టీడీపీ హయాంలో 80 నుంచి 85 శాతం 'ఉపాధి' నిధులు స్వాహా
- చెక్‌డ్యామ్‌ల్లో వరదలై పారిన అక్రమాలు
- అప్పట్లో టీడీపీ నాయకులు, కార్యకర్తల ఆధ్వర్యంలోనే పనులు
- మస్టర్లలో మాయాజాలం.. ఐదేళ్లలో రూ. వెయ్యి కోట్ల అవినీతి
- అలాంటి పాలన వద్దంటున్న ప్రజలు

కర్నూలు(అగ్రికల్చర్): టీడీపీ హయాంలో (2014 నుంచి 2019 వరకు) జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులు మొత్తం టీడీపీ నాయకులు, కార్యకర్తల ఆధ్వర్యంలోనే జరిగాయి. ఫీల్డ్ అసిస్టెంట్లు టీడీపీకి చెందిన వారే ఉండటంతో అక్రమాలకు అడ్డే లేకుండా పోయింది. ఎన్ఆర్ఈజీఎస్ నిధులు కేంద్రప్రభుత్వానికి చెందినవైనా తమవే అన్నట్లుగా ఇష్టారాజ్యంగా స్వాహా పర్వం సాగింది. అప్పట్లో మెటీరియల్ కాంపోనెంటు కింద చెక్‌డ్యామ్‌లు, గ్రావెల్ రోడ్ల నిర్మాణాలకు ప్రాధాన్యత ఇచ్చారు. అవినీతికి కొత్తభాష్యం చెప్పారు. పంచాయతీరాజ్, నీటిపారుదల శాఖలతో పాటు వాటర్‌షెడ్ కార్యక్రమాల కింద 2014 సంవత్సరానికి ముందు చేపట్టిన పనులకు మెరుగులు దిద్ది కోట్ల రూపాయల 'ఉపాధి' నిధులు కొల్లగొట్టారు. నిధుల దుర్వినియోగాన్ని అరికట్టాల్సిన బాధ్యత ఏపీవో, ఎంపీడీవో, ఏపీడీలపై ఉన్నా...వారికి సైతం ముడుపులు ఇచ్చి అక్రమాలను పారించారు. టీడీపీ హయాంలో ప్రతి ఏటా కరువు వచ్చింది. కూలీలకు పనులు కల్పించాలనే లక్ష్యంతో వేల కోట్లు గుమ్మరించారు. ఇంతభారీగా నిధులు వ్యయం చేసినప్పటికీ ఎక్కడా వీటికి సంబంధించిన పనులు కన్పించకపోవడం గమనార్హం.



చంద్రబాబు హయాంలో ప్యాపిలి మండలంలో నిర్మించిన చెక్‌డ్యామ్ దుస్థితి ఇది

డోన్ నియోజకవర్గంలో పతాక స్థాయిలో అవినీతి....

జిల్లాలో 14 అసెంబ్లీ నియోజక వర్గాలు ఉండగా... ఎన్ఆర్ఈజీఎస్ పనుల్లో డోన్ నియోజకవర్గంలోనే పతాక స్థాయిలో అవినీతి చోటు చేసుకుంది. ఈ నియోజకవర్గంలో జరిగిన అవినీతి కార్యక్రమాలపై గ్రామీణాభివృద్ధి శాఖలోని నరేగ క్వాలిటీ కంట్రోల్, విజిలెన్స్ ఎన్‌ఫోర్సుమెంట్ బృందం విచారణ జరిపింది. కనీవినీ ఎరుగని రీతిలో అవినీతి జరిగిందని నిర్ధారించింది. ఒక్క ప్యాపిలి మండలంలోనే రూ.100 కోట్ల వరకు అవినీతి జరిగిందంటే అక్రమాలు ఏ స్థాయిలో ఉన్నాయో స్పష్టమవుతోంది. పంచాయతీరాజ్, నీటిపారుదల శాఖలు చేపట్టిన పనులను కూడా 'ఉపాధి' కింద చూపి నిధులు కొల్లగొట్టారు. ఒక పనికి పంచాయతీ రాజ్ అధికారులు, మరోవైపు ఎన్ఆర్ఇజీఎస్ కింద నిధులు చెల్లించారు. రూ.100 విలువ పనిలో రూ.15 నుంచి 20 ఖర్చు చేసి రూ.80 కొల్లగొట్టినట్లు తెలుస్తోంది. డోన్ నియోజకవర్గం మొత్తం ఇదే తరహాలోనే పనులు నిర్వహించినట్లు సమాచారం.

ఐదేళ్లలో రూ.1000 కోట్లు స్వాహా!

టీడీపీ పాలన ఐదేళ్లలో జిల్లా మొత్తం మీద రూ.1,500 కోట్లు వ్యయం చేశారు. ఇందులో టీడీపీ నేతలు రూ.1,000 కోట్లకుపైగా స్వాహా చేయడం అప్పట్లో కలకలం రేపింది. ఫీల్డ్ అసిస్టెంట్లు టీడీపీకి చెందిన వారే... పనులు చేసేది టీడీపీ కార్యకర్తలు, నేతలే! అవినీతి జరుగుతున్నా.. పట్టించుకోకుండా మామూళ్ల మత్తులో అధికారులు పడిపోయారు. వెరసి ఐదేళ్లలో రూ.1,000 కోట్లు టీడీపీ కార్యకర్తలు, నాయకుల జేబుల్లోకి వెళ్లిపోయాయి. డోన్, ప్యాపిలి, పత్తికొండ, కృష్ణగిరి, తుగ్గలి, వెల్దుర్తి, ఆదోని, ఎమ్మిగనూరు, ఆలూరు, కోడుమూరు నియోజక వర్గాల్లో పాత పనులకు మెరుగులు దిద్ది... దొంగ మస్టర్లు వేసి నిధులను కొల్లగొట్టారు. వెల్దుర్తి మండలంలో గతంలో పంచాయతీ రాజ్ అధికారులు నిర్మించిన చెక్‌డ్యామ్‌లకు టీడీపీ నేతలు మెరుగులు దిద్ది ఉపాధి నిధులు కొల్లగొట్టారు. ఉపాధి పనులకు రోజుకు 50 వేల మంది హాజరైతే 3 లక్షల మంది హాజరైనట్లు మస్టర్లు వేసిన రోజులు అనేకం ఉన్నాయి. పత్తికొండ నియోజకవర్గంలోని కృష్ణగిరి మండలంలో పాతపనులకే మెరుగులు దిద్ది నిధులు మింగేశారు. ఒక పనికి రెండు మండలాల్లో బిల్లులు చేసుకొని నిధులను కొల్లగొట్టారు. చెక్‌డ్యామ్‌లకు మెరుగులు దిద్ది డోన్, తగ్గలి మండలాల్లో బిల్లులు చేశారు. ఈ సంఘటనలపై క్రిమినల్ కేసులు కూడా నమోదయ్యాయి.

> **చంద్రబాబు పాలన మాకొద్దు బాబోయ్....**
>
> 2014 నుంచి 2019 వరకు జరిగిన అక్రమాలు, అవినీతిని కళ్లారా చూసిన ప్రజలు చంద్రబాబు పాలన మాకొద్దు బాబోయ్ అంటున్నారు. చంద్రబా బు పాలనను కోరుకుంటున్నది నాటి జన్మభూమి కమిటీల సభ్యులు, అప్పట్లో అడ్డుగోలుగా అక్రమాల కు పాల్పడి సంపాదించుకున్న వారు మాత్రమే కా వడం గమనార్హం. వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వం ప్రజల ముంగిటకే వచ్చింది. ఆర్‌బీకేలు, సచివాలయాలు, వలంటరీ వ్యవస్థ ద్వారా పాదర్శపాలన అందించింది. అర్హతే ప్రామాణికంగా లబ్ధిదారులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రజాహిత పాలనను ప్రజలు కోరుకుంటున్నారు.

మెరుగులు దిద్ది.. నిధులు మెక్కి!

చంద్రబాబు పాలనలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో జరిగిన భారీ అవినీతికి ఇది చక్కటి నిదర్శనం. వెల్దుర్తి మండలం ఎస్.పేరేముల గ్రామంలోని ఎర్రక్క పొలం సమీపంలోని వంకలో 2016లో పంచాయతీ రాజ్ శాఖ రెండు చెక్‌డ్యామ్‌లు నిర్మించింది. ఒక్కోదానికి పంచాయతీ రాజ్ అధికారులు రూ.5.5 లక్షలు వ్యయం చేశారు. ఈ చెక్‌డ్యామ్‌లకే టీడీపీ నేత మెరుగులు దిద్ది రూ.11 లక్షలు కాజేశారు. వ్యవసాయ కూలీలతో కాకుండా ప్రొక్లెయిన్లతో పనులు చేయించారు. వ్యవసాయ కూలీలతోనే పనులు చేయించినట్లు మస్టర్లు సృష్టించి..బినామీ పేర్లతో ఉపాధి నిధులను కొల్లగొట్టారు.

> **వైఎస్ఆర్‌సీపీ పాలనలో ఇలా..**
>
> వైఎస్ఆర్‌సీపీ పాలనలో ఉపాధి నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులు కళ్లకు కట్టినట్లు కనిపిస్తున్నాయి. అవినీతికి కేంద్రబిందువులైన చెక్ డ్యామ్‌ల నిర్మాణాలకు స్వస్తి పలికి మెటీరియల్ కాంపోనెంటు కింద గ్రామ సచివాలయాలు, ఆర్‌బీకేలు,డిజిటల్ లైబ్రరీలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు, బల్క్‌మిల్క్ కూలింగ్ సెంటర్లు, సీసీ రోడ్లు న నిర్మించారు. ఏ గ్రామానికి వెళ్లినా ఇవన్నీ కనిపిస్తాయి. ఉపాధి నిధులను సద్వినియోగం చేయడంతో గ్రామాల్లో మౌలిక సదుపాయాలు అందుబాటులోకి వచ్చాయి. మెటీరియల్ కాంపోనెంటు కింద చిన్న, సన్నకారు, ఎస్సీ, ఎస్టీ రైతులకు స్థిరాస్తి కల్పించాలనే లక్ష్యంతో పండ్లతోటలు అభివృద్ధి చేశారు. ఐదేళ్లలో కర్నూలు జిల్లాలో 11,374 ఎకరాలు, నంద్యాల జిల్లాలో 7,875 ఎకరాల్లో పండ్ల తోటలు అభివృద్ధి చెందాయి.

ఉపాధి నిధులు కొల్లగొట్టారు



చంద్రబాబు హయాంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఉపాధి నిధులను కొల్లగొట్టారు. మళ్లీ టీడీపీ అధికారంలోకి వస్తే అవినీతి పెరిగిపోతుంది. వైఎస్సార్‌సీపీ పాలనలో అభివృద్ధి, సంక్షేమం కళ్లకు కట్టినట్లు కనిపిస్తోంది. ఏ గ్రామానికి వెళ్లినా ఉపాధి నిధులతో నిర్మించిన గ్రామ సచివాలయాలు, ఆర్‌బీకేలు, డిజిటల్ లైబ్రరీలు, వైఎస్ఆర్ హెల్త్ క్లీనిక్‌లు , పండ్లతోటలు కనిపిస్తున్నాయి. అవినీతికి తావు లేకుండా సంక్షేమ పథకాలు అమల య్యాయి.

– తిరుమలరెడ్డి, కోట్రాయి గ్రామం, డోన్ మండలం

చంద్రబాబు అంటేనే అవినీతి



చంద్రబాబు అంటేనే అవినీతి, అక్రమాలకు మారుపేరు. ఆయన హయాంలో కల్లూరు మండలంలో జరిగిన అక్రమాలకు అంతే లేదు. కూలీల కడుపుగొట్టి యంత్రాలతో పనులు చేయించారు. అప్పట్లో జరిగిన అవినీతి ఎన్నటికీ మరువలేనిది. వైఎస్సార్‌సీపీ పాలనలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు పారదర్శకంగా అమలు అయ్యాయి. చంద్రబాబు వస్తే అవినీతి లేచి కూర్చుంటుందనటంతో ఎటువంటి సందేహం లేదు.

– నారాయణరెడ్డి, రేమదూరు, కల్లూరు మండలం

దోచుకున్నోళ్లకు దోచుకున్నంత....

టీడీపీ హయాంలో చేపట్టిన ఉపాధి పనులు ఆ పార్టీ నాయకులకు కాసుల వర్షం కురిపించాయి. అధికారులపై ఒత్తిళ్లు తెచ్చి మరీ తెలుగు తమ్ముళ్లు అందినకాడికి దోచుకున్నారు. ప్యాపిలి మండలంలోని వెంగళాంపల్లె గ్రామంలో నిర్మించిన చెక్‌డ్యామ్‌ను పరిశీలిస్తే అవినీతి ఏ స్థాయిలో జరిగిందో ఊహించవచ్చు. గ్రామ సమీపంలోని వంకలో ఇతర శాఖలు నిర్మించిన చెక్‌డ్యామ్‌కు ఎన్ఆర్ఇజీఎస్ నిధులతో మెరుగులు దిద్దారు. ఈ చెక్‌డ్యామ్‌కు రూ. 8 లక్షల ఖర్చు చేసినట్లు చూపి నిధులు మింగేశారు. కొద్ది రోజులకే ఈ చెక్‌డ్యామ్ కూలి పోయింది.

జనహోరు





కర్నూలు రూరల్ మండలం గార్గేయపురంలో ప్రచారానికి భారీగా తరలివచ్చిన ప్రజలు (ఇన్‌సెట్) అభివాదం చేస్తున్న కోడుమూరు ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిమూలపు సతీష్, కర్నూలు ఎంపీ అభ్యర్థి బీవై రామయ్య

ఎన్నికల విధుల్లో పొరపాట్లకు తావివ్వొద్దు

- అధికారులను ఆదేశించిన స్పెషల్ జనరల్ అబ్జర్వర్ రామ్‌మోహన్ మిశ్రా
- ఎన్నికల నిర్వహణ చర్యలు బాగున్నాయని కలెక్టర్‌కు అభినందన

కర్నూలు(సెంట్రల్): పొరపాట్లకు తావివ్వకుండా ఎన్నికల విధులను నిర్వర్తించాలని అధికారులను స్పెషల్ అబ్జర్వర్ రామ్ మోహన్ మిశ్రా ఆదేశించారు. కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో సాధారణ ఎన్నికల నిర్వహణపై జనరల్ అబ్జర్వర్లు, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ సృజనతో కలసి సోమవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భద్రతాపరంగా తీసుకోవాల్సిన చర్యలపై రాజీ పడొద్దన్నారు. డబ్బు, మద్యం అక్రమ రవాణా అరికట్టేందుకు చెక్‌పోస్టుల్లో నిఘా పటిష్టం చేయాలన్నారు. ఈవీఎం కమిషనింగ్ , పోలింగ్ కేంద్రాల్లో వసతులపై ఆరా తీశారు. వెబ్‌కాస్టింగ్‌ను త్వరగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. జిల్లాలో ఎన్నికల నిర్వహణ కోసం తీసుకుంటున్న చర్యలు బాగున్నాయని, కలెక్టర్‌ను అభినందిస్తున్నట్లు చెప్పారు. తొలుత జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన జిల్లాలో ఎన్నికల నిర్వహణ కోసం తీసుకుంటున్న చర్యలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. జిల్లాలో ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి 2,204 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, వాటి లేవుట్ ప్లాన్‌లు కూడా సిద్ధంగా ఉన్నాయన్నారు. ప్రతి నియోజకవర్గంలో ఒక మోడల్ పోలింగ్ కేంద్రం ఉండే విధంగా చర్యలు తీసుకుంటున్నారు. దివ్యాంగుల కోసం 1,096 పోలింగ్ కేంద్రాల్లో వీల్‌చైర్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. బ్రెయిలీ ఓటరు స్లిప్పులు సోమవారం జిల్లాకు రానున్నాయని, వాటిని కూడా పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. జిల్లాలో 18 వల్నరబుల్ , 320 క్రిటికల్ పోలింగ్ కేంద్రాలను గుర్తించి భద్రతాపరంగా అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. కార్యక్రమంలో జనరల్ అబ్జర్వర్లు జాఫర్, మీర్ తారిఖ్ అలీ, పోలీసు అబ్జర్వర్ ఉమేష్‌కుమార్, ఎన్నికల వ్యయ పరిశీలకులు ఆర్ఆర్ ఎస్ శుక్లా, జేసీ నారపురెడ్డి మౌర్య, మునిసిపల్ కమిషనర్ భార్గవ్‌తేజ, డీఆర్వో కె.మధుసూదన్‌రావు పాల్గొన్నారు.





మాట్లాడుతున్న స్పెషల్ జనరల్ అబ్జర్వర్ రామ్‌మోహన్ మిశ్రా, హాజరైన అబ్జర్వర్లు, జిల్లా ఎన్నికల అధికారులు

ప్రశాంతంగా పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్

- మొదటి రోజు ఓటు హక్కు వినియోగించుకున్న 6,024 మంది ఉద్యోగులు
- ఎమ్మిగనూరు పోస్టల్ బ్యాలెట్ కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్ సృజన

కర్నూలు(సెంట్రల్): ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులు, అత్యవసర సేవల్లో పనిచేసే 33 శాఖల ఉద్యోగులకు కేంద్ర ఎన్నికల సంఘం కల్పించిన పోస్టల్ బ్యాలెట్ ప్రశాంత వాతావరణంలో కొనసాగింది. జిల్లాలోని 8 నియోజకవర్గాలకు సంబంధించి ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ సెంటర్లలో ఉదయం 9 నుంచి ఉద్యోగులు తమ ఓటు హక్కును వినియోగించున్నారు. మూడు రోజులపాటు జరిగే పోస్టల్ బ్యాలెట్ పోల్‌లో మొదటి రోజు 20,351 మందికిగాను 6,024 మంది ఉద్యోగులు ఓటు వేశారు. మొత్తం ఓటర్లలో 29.60 శాతం ఉద్యోగులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. మంగళ, బుధవారాల్లో కూడా పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ కొనసాగుతుంది.

బారులు తీరి..

కేంద్ర ఎన్నికల సంఘం మే 6, 7, 8 తేదీల్లో పోస్టల్ బ్యాలెట్ వినియోగం కోసం ప్రతి నియోజకవర్గంలో పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేసింది. అందులో భాగంగా మొదటి రోజు ఉదయం 9 గంటలకే పోస్టల్ బ్యాలెట్ పోల్ ప్రారంభమైంది. పోస్టల్ బ్యాలెట్ ఓటర్లు బారులు తీరి ఓటు హక్కు వినియోగించుకున్నారు. జిల్లాలో మొత్తం 20,351 మంది ఓటర్లకు గాను మధ్యాహ్నం 12 గంటలకు 1,804మంది పోస్టల్ ఓటు వేశారు. మధ్యాహ్నం 1 గంటకు 3,096 మంది, 3 గంటలకు 4,826 మంది, సాయంత్రం 5 గంటలకు 6,024 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. నిబంధనలు ప్రకారం పోలింగ్ 5 గంటలకు ముగియాలి. అయితే 5గంటల వరకు క్యూలో ఉన్న వారికి చీటీలు ఇచ్చి ఓటు వేసే అవకాశం కల్పించారు. కొన్ని నియోజకవర్గాల్లో సాయంత్రం 6 నుంచి 7 గంటల వరకు పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ జరిగింది. ఇదిలా ఉండగా ఎమ్మిగనూరు ఎంపీడీఓ మీటింగ్ హాలులో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ సెంటర్‌ను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ సృజన పరిశీలించారు. ఉద్యోగులకు ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు.



ఆదోనిలో హోం ఓటింగ్ వేస్తున్న వృద్ధురాలు



కర్నూలు పోస్టల్ బ్యాలెట్ కేంద్రంలో ఉద్యోగులు

నియోజకవర్గం	పోస్టల్ బ్యాలెట్ ఓటర్లు	ఓటువేసిన వారు	హోంఓటింగ్ ఓటర్లు	ఓటువేసిన వారు
కర్నూలు	4,422	1,254	53	50
పత్తికొండ	2,098	573	118	50
కోడుమూరు	2,316	806	127	93
ఎమ్మిగనూరు	2,775	1,096	171	87
మంత్రాలయం	833	226	78	41
ఆదోని	2,018	671	63	59
ఆలూరు	1,454	312	228	143
పాణ్యం	4,435	1,546	159	0
మొత్తం	20,351	6,484	997	523

ఇంటి నుంచే ఓటు వేసిన వృద్ధులు

కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు తొలిసారి ఇంటి నుంచే 85 ఏళ్ల దాటిన వృద్ధులు, అనారోగ్యంతో బాధపడుతూ ఇంటికే పరిమితమైన రోగులు ఓటు వేశారు. జిల్లాలోని పాణ్యం నియోజకవర్గం తప్ప మిగిలిన ఏడు నియోజకవర్గాల్లో హోం ఓటింగ్ ప్రక్రియ ప్రారంభమైంది. సెక్టోరల్ ఆఫీసర్లకు శిక్షణ ఉండడంతో పాణ్యం నియోకవర్గంలో మంగళ, బుధవారాల్లో హోం ఓటింగ్ నిర్వహించాలని నిర్ణయించినట్లు ఆర్వో, జేసీ నారపురెడ్డి మౌర్య తెలిపారు. జిల్లాలో మొదటి రోజు ఏడు నియోజకవర్గాల్లో 251 మంది వృద్ధులు ఇంటి నుంచే ఓటు వేశారు. ఇందుకోసం జిల్లా ఎన్నికల సంఘం 90 మొబైల్ టీంలను ఏర్పాటు చేసింది. కాగా, జిల్లాలో మొత్తం 997 మంది ఇంటి నుంచి ఓటు వేసేందుకు ఆప్షన్ ఇచ్చారు.

చంద్రబాబు ఫ్లాప్‌షో

● జనాలు లేక వెలవెలబోయిన ప్రజాగళం సభ



చంద్రబాబు మాట్లాడుతుండగానే వెనుదిరిగిన ప్రజలు

కర్నూలు(అర్బన్): తెలుగు దేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు ప్రజాగళం పేరుతో పాణ్యం అసెంబ్లీ నియోజకవర్గం చెన్నమ్మ సర్కిల్‌లో నిర్వహించిన సభ వెలవెలబోయింది. ఉదయం 10:30 గంటలకు చంద్రబాబు సభ జరుగుతుందని భారీగా ప్రచారం జరిగింది. ఈ నేపథ్యంలోనే చెన్నమ్మ సర్కిల్ ప్రాంతంలో 10:30 గంటలకు అక్కడక్కడా జనం పలచగా వచ్చి చేరారు. 11 గంటలకు చంద్రబాబు నాయుడు ఎస్‌ఏపీ క్యాంపునకు చేరుకున్నారని, మరో పది నిమిషాల్లో సభా స్థలికి వస్తారని మైకులో పదేపదే చెప్పినా ప్రజల నుంచి పెద్దగా స్పందన కనిపించలేదు. కర్నూలు నగరపాలక సంస్థలో అంతర్ భాగమైన కల్లూరులోని పలు వార్డుల నుంచి ప్రజలను తీసుకువచ్చేందుకు చేసిన ప్రయత్నాలు పెద్దగా ఫలించలేదు. కల్లూరు రూరల్ పరిధిలోని పలు గ్రామాల నుంచి ఒక మోస్తరుగా జనం హాజరయ్యారు. అయితే చెప్పిన సమయానికి కాకుండా 11:45 గంటలకు చంద్రబాబు సభాస్థలికి చేరుకోవడంతో అప్పటికే ఉన్న కొద్దిపాటి ప్రజలు కూడా వెనుదిరిగేందుకు ప్రయత్నించారు. ఈ నేపథ్యంలోనే పలువురు టీడీపీ నాయకులు వారిని బతిమాలి ఎలాగోలా చంద్రబాబు ప్రసంగం పూర్తయ్యేంతవరకు ఉండాలని కోరారు. ముందుగా పాణ్యం అసెంబ్లీ అభ్యర్థి గౌరుచరితారెడ్డి, నంద్యాల పార్లమెంటు అభ్యర్థి బైరెడ్డి శబరి ప్రసంగించిన అనంతరం చంద్రబాబు ప్రసంగాన్ని ప్రారంభించారు. చంద్రబాబు ప్రసంగిస్తున్న సమయంలోనే చాలా మంది వెనుదిరిగారు. కేవలం ఆయన ప్రసంగిస్తున్న వాహనం చుట్టూ ఉన్న టీడీపీ నేతలు, కార్యకర్తల ఆహా, ఓహోల మధ్య ప్రసంగం సాగింది. ఏది ఏమైనా చంద్రబాబు నిర్వహించిన ప్రజాగళం సభ ఫ్లాప్‌షోగా మారింది.



మహానంది: బండిఆత్మకూరులో భారీగా తరలివచ్చిన ప్రజలు (ఇన్‌సెట్) గజమాలతో ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి, ఎంపీ పోచాబ్రహ్మానందరెడ్డికి స్వాగతం పలికిన గ్రామస్తులు



దేవనకొండ: ప్రజలనుద్దేశించి మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ ఆలూరు ఎమ్మెల్యే అభ్యర్థి విరూపాక్షి



బనగానపల్లె: ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి రోడ్డు షోలో భారీగా పాల్గొన్న ప్రజలు



ఎమ్మిగనూరు రూరల్: గుడేకల్ రోడ్ షోలో ప్రజలకు అభివాదం చేస్తున్న ఎమ్మిగనూరు ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుక



జూపాడుబంగ్లా: ఫ్యాన్ గుర్తును చూపిస్తూ ఓటు వేయాలని కోరుతున్న నందికొట్కూరు ఎమ్మెల్యే అభ్యర్థి దారా సుధీర్



గడివేముల: పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డికి ఘనస్వాగతం పలుకుతున్న ప్రజలు

ప్రచార పర్వం

పోటెత్తిన అభిమానం

ఎన్నికల ప్రచారంతో ఊరావాడా హోరెత్తుతోంది. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్యే అభ్యర్థుల ప్రసంగాలతో ప్రజల్లో నూతనోత్సాహం నెలకొంటోంది. రోడ్‌షోలకు, ర్యాలీలకు అభిమానులు పోటెత్తుతున్నారు. ప్రజలు భారీగా తరలివచ్చి అధికార పార్టీకి మద్దతు ఇస్తున్నారు. వైఎస్సార్‌సీపీ జెండాలు చేతపట్టుకుని కందం తొక్కుతున్నారు. పార్టీ కార్యకర్తలు, నాయకులు బైక్ ర్యాలీలతో ప్రచారం నిర్వహిసున్నారు. కొందరు బ్యాలెట్ నమూనా చూపుతూ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థిస్తున్నారు. ఐదేళ్లలో చేసిన అభివృద్ధిని, సంక్షేమాన్ని గెలిపించాలని కోరుతున్నారు.

-సాక్షినెట్‌వర్క్



కొత్తపల్లె: బ్యాలెట్ నమూనా చూపుతూ నదిచాగిలో ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



నంద్యాల (అర్బన్): నంద్యాల మండలం కానాల గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తల బైక్ ర్యాలీ



కర్నూలు: కల్లూరు చెన్నమ్మ సర్కిల్‌లోని పోలీస్ కాలనీలో వైఎస్సార్‌సీపీ తరఫున ప్రచారం నిర్వహిస్తున్న మహిళలు



కర్నూలు: కొత్తపేట బహిరంగ సభలో వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి బీవై రామయ్య, ఎమ్మెల్యే అభ్యర్థి ఇంతియాజ్‌కు గజమాల వేసిన అభిమానులు



ఆదోని టౌన్: పాత వసంత టాకీస్ సర్కిల్‌లో ప్రచార రథంపై నుంచి మాట్లాడుతున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి



ఆళ్లగడ్డ: మర్రిపల్లెలో పూలు చల్లుతూ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డికి స్వాగతం పలుకుతున్న మహిళలు



డోన్: ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డికి గుమ్మడికాయలతో దిష్టి తీస్తున్న మహిళలు



పత్తికొండ రూరల్ : పత్తికొండ ఎస్సీకాలనీలో కార్యకర్తలతో కలసి ర్యాలీగా వెళ్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

సమన్వయ లోపంతోనే 'పోస్టల్ బ్యాలెట్' సమస్య

● పోస్టల్ బ్యాలెట్ ఓటర్లందరికీ ఓటు వేసే అవకాశం కల్పిస్తాం
● పాణ్యం ఆర్వో, జేసీ నారపురెడ్డి మౌర్య వెల్లడి



పోస్టల్ బ్యాలెట్ ఓటర్లతో మాట్లాడుతున్న పాణ్యం నియోజకవర్గ ఆర్వో మౌర్య

కర్నూలు(సెంట్రల్): నంద్యాల జిల్లాలో అధికారుల మధ్య సమన్వయం లేకపోవడంతో సమస్య ఉత్పన్నమైందని..పాణ్యం నియోజకవర్గంలో పోస్టల్ బ్యాలెట్ ఉన్న ఓటర్లందరికీ ఓటు వేసే అవకాశం కల్పిస్తామని పాణ్యం ఆర్వో, జేసీ నారపురెడ్డి మౌర్య తెలిపారు. సోమవారం సాయంత్రం ఆమె బీక్యాంపు బాయ్స్ ఉన్నత పాఠశాలలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పాణ్యం నియోజకవర్గంలో ఓటు ఉండి నంద్యాల జిల్లాలో పనిచేస్తున్న ఉద్యోగులకు మొదటి విడత శిక్షణ ఇచ్చిన ఆర్వో కార్యాలయంలో పోస్టల్ బ్యాలెట్ కోసం దరఖాస్తులను స్వీకరించారన్నారు. అయితే రెండో విడత శిక్షణను దరఖాస్తులు స్వీకరించిన ఆర్వో పరిధిలో కాకుండా మరో నియోజకవర్గ ఆర్వో పరిధిలో శిక్షణ ఇచ్చి అక్కడే వారికి పోస్టల్ బ్యాలెట్‌ను ఫెసిలిటేట్ చేశారన్నారు. నంద్యాల జిల్లా నుంచి వచ్చిన పోస్టల్ ఓటర్ల వివరాలను పరిశీలించి నంద్యాల జిల్లా కలెక్టర్‌కు పాణ్యం ఆర్వోగా తాను పంపానన్నారు. అయితే అక్కడి అధికారుల మధ్య సమన్వయ లోపంతో పోస్టల్ ఓటర్ల జాబితా మొదటి శిక్షణ ఆర్వో పరిధి నుంచి రెండో విడత శిక్షణ ఆర్వో పరిధిలోకి వెళ్లలేదన్నారు. ఈ క్రమంలో పోస్టల్ బ్యాలెట్ కోసం దరఖాస్తులు ఇచ్చిన ఆర్వో ఫెసిలిటేషన్ సెంటర్లకు వెళ్లిన ఉద్యోగులకు ఓటు లేదని చెప్పడంతో సుమారు 1,066 మంది పాణ్యం ఆర్వో అయిన తన దగ్గరకు వచ్చారన్నారు. అయితే వీరందరూ ఓటు లేదని ఆందోళన చెందాల్సిన పనిలేదని, మంగళవారం ఫామ్-12 ఇచ్చినా బుధవారం ఓటు వేయడానికి అవకాశం కల్పిస్తామన్నారు. లేదంటే రెండో విడత ఎన్నికల శిక్షణ జరిగిన ఆర్వో ఫెసిలిటేషన్ సెంటర్‌కు వెళ్లాలని, ప్రస్తుతం ఓటర్లందరి వివరాలను పంపామని, ఇప్పుడు ఓటు వేయడానికి అవకాశం కల్పిస్తారని సూచించారు.

గుర్తు తెలియని వ్యక్తుల దాడిలో వ్యక్తి మృతి



మృతి చెందిన వడ్డే బాలు

డోన్ టౌన్: పట్టణంలోని చిగురమానుపేటలో ఉన్న ఆంజనేయస్వామి గుడి ఎదురుగా గుర్తు తెలియని వ్యక్తుల దాడిలో అదే కాలనీకి చెందిన వడ్డే బాలు (46) మృతి చెందినట్లు పట్టణ సీఐ ప్రవీణ్‌కుమార్ సోమవారం తెలిపారు. భార్య వదిలేయడంతో వడ్డే బాలు చిత్తు పేపర్లు ఏరుకుని జీవనం సాగిస్తూ ఫుట్‌పాత్‌పైనే కాలం గడుపుతున్నాడు. ఈయన సోమవారం ఉదయానికి తీవ్రంగా గాయపడి మృతి చెంది ఉండటంతో పోలీసులు ఆరా తీస్తున్నారు. ఆదివారం రాత్రి మృతుని చెల్లెలు జ్యోతి బిర్యానీ ప్యాకెట్ కూడా ఇచ్చి వెళ్లిందని, బాలుతో గుర్తు తెలియని వ్యక్తులు గొడవ పడి రాళ్లతో కొట్టి చంపినట్లు ఆనవాళ్లు గుర్తించినట్లు సీఐ తెలిపారు. మృతుని చెల్లెలు జ్యోతి ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అత్తను చంపిన అల్లుడు



మృతి చెందిన లక్ష్మీదేవి

పాణ్యం: తమ కాపురానికి అత్త అడ్డుతగులుతుందని అల్లుడే దారుణంగా హత్య చేశాడు. ఈ సంఘటన పాణ్యంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ అశోక్ తెలిపిన వివరాల మేరకు.. స్థానిక అయ్యపురెడ్డి కాలనీకి చెందిన చల్లా శ్రీరాములు, చల్లా లక్ష్మీదేవి (47)లకు రాజేశ్వరి, సురేంద్ర సంతానం. 13 ఏళ్ల క్రితం రాజేశ్వరిని డోన్ మండలం ఉడుములపాడు గ్రామానికి చెందిన తలారి రాజేష్‌కు ఇచ్చి వివాహం చేశారు. తరచూ భార్యాభర్తలు గొడవ పడేవారు. దీంతో ఆమె పుట్టింటికి చేరుకుంది. కాపురానికి రావాలని కోరినా ఆమెలో మార్పు రాలేదు. అయితే తమ కాపురానికి అత్త లక్ష్మీదేవి అడ్డుతగులుతుందని, ఎలాగైనా వదిలించుకోవాలని పథకం పన్నాడు. ఆదివారం రాత్రి నిద్రిస్తున్న చల్లా లక్ష్మీదేవి తలపై రాజేష్ కర్రతో కొట్టడంతో తీవ్ర రక్తస్రావమైంది. చికిత్స నిమిత్తం కుటుంబీకులు నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యులు ప్రాథమిక చికిత్స చేసి పరిస్థితి విషమంగా ఉండటంతో కర్నూలుకు రెఫర్ చేశారు. కర్నూలుకు తీసుకెళ్తుండగా ఆమె మార్గమధ్యలో చనిపోయారు. విషయం తెలుసుకున్న సీఐ నల్లప్ప సంఘటన స్థలానికి చేరుకుని హత్యకు కారణాలపై ఆరా తీస్తున్నారు. మృతురాలి కుమారుడు సురేంద్ర ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వడదెబ్బతో మహిళ మృతి



మృతి చెందిన లక్ష్మీదేవి (ఫైల్)

తుగ్గలి: వడదెబ్బకు గురై మహిళ మృతి చెందిన ఘటన మండల పరిధిలోని ముక్కెల్లలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన లక్ష్మీదేవి(35) మూడు రోజులుగా వ్యవసాయ పనులకు వెళ్లేది. వడదెబ్బకు గురై సోమవారం తెల్లవారుజామున అస్వస్థతకు గురైంది. చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు పత్తికొండ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చేరిన కొద్దిసేపటికే మృతి చెందినట్లు మృతురాలి భర్త బాలరాజు తెలిపారు. మృతురాలికి ఇద్దరు కూతుళ్లు, ఇద్దరు కుమారులు ఉన్నారు.

క్లుప్తంగా

ఆధారాలు లేని రూ.4.36 లక్షలు పట్టివేత



తనిఖీల్లో పట్టుబడిన నగదును పరిశీలిస్తున్న చెక్‌పోస్టు సెబ్ సిబ్బంది

కర్నూలు: స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో తనిఖీల్లో ఎలాంటి ఆధారాలు లేని రూ.4.36 లక్షలు పట్టుబడింది. కర్నూలు శివారులోని పంచలింగాల అంతర్రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టు వద్ద సెబ్ ఎస్‌ఐ రాజశేఖర్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి వాహన తనిఖీలు నిర్వహించారు. రాత్రి 10 గంటల సమయంలో హైదరాబాద్ నుంచి కర్నూలుకు వస్తున్న ప్రైవేటు బస్సును ఆపారు. నంద్యాల పట్టణానికి చెందిన నిస్సార్ అహ్మద్ అనుమానాస్పదంగా కనిపించడంతో అతని వద్ద ఉన్న బ్యాగును తనిఖీ చేశారు. అందులో రూ.4.36 లక్షలు గుర్తించారు. నగదును సీజ్ చేసి ఎఫ్‌ఎస్‌టీ టీమ్ ఎన్నికల విచారణ కమిటీకి అప్పగించారు. ఆదారాలు చూపకపోవడంతో అతన్ని అదుపులోకి తీసుకుని పూర్తిస్థాయిలో విచారణ చేస్తున్నారు. ఎన్నికల సమయం కావడంతో నగదును ఆదాయ శాఖకు అప్పగించిన ఐదు రోజుల్లోగా యజమాని క్యాష్ సీజర్ రివ్యూ కమిటీకి దరఖాస్తు చేసుకోవాల్సి ఉంది.

కూతురి జోలికి రావద్దన్నందుకు కొడవలితో దాడి



చికిత్స పొందుతున్న ఓబులేసు

పత్తికొండ రూరల్: తన కూతురి జోలికి రావద్దని కోరిన తండ్రిని ఓ యువకుడు కొడవలితో విచక్షణారహితంగా దాడి చేసి గాయపరిచాడు. ఈ ఘటన మండల పరిధిలోని పుచ్చకాయలమాడ గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. సీఐ మురళీమోహన్ తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన ఓబులేసు కూతురిని అదే గ్రామానికి చెందిన కాశీనాథ్ అలియాస్ సింహాద్రి కొన్ని రోజులుగా ప్రేమ పేరుతో వేధిస్తున్నాడు. ఇదే విషయమై ఇటీవల ఓబులేసు తన బంధువులతో కలిసి కాశీనాథ్‌ను నిలదీశారు. ఈ విషయాన్ని మనసులో పెట్టుకుని సోమవారం ఓబులేసు ఇంటి వద్ద ఉండగా ఒక్కసారిగా కొడవలి కాశీనాథ్ దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన ఓబులేసును పత్తికొండ ప్రభుత్వాసుపత్రికి తరలించగా పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యుల సలహా మేరకు మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

వాహనాల తనిఖీ



రికార్డులను తనిఖీ చేస్తున్న ఆర్‌టీఓ

డోన్ రూరల్: డోన్ పట్టణ పరిధిలోని 44వ జాతీయ రహదారిపై సోమవారం వాహన తనిఖీలు చేసినట్లు ఆర్‌టీఓ క్రాంతికుమార్ తెలిపారు. రోడ్డు ట్యాక్స్, అధిక లోడ్డుతో పాటు రికార్డులు సరిగ్గా లేని వాహనదారులకు రూ.5,59,500 జరిమానా విధించినట్లు చెప్పారు. డ్రైవర్లు తప్పనిసరిగా వాహనాల్లో రికార్డులు ఉంచుకోవాలని సూచించారు.

వివాహిత అనుమానాస్పద మృతి

కర్నూలు: స్థానిక పాతబస్తీలోని విజయ నగర్ కాలనీలో నివాసముంటున్న షేక్ ఫర్జానా (27) అనుమానాస్పద స్థితిలో మృతిచెందింది. భర్త నబీసాహెబ్ ఆటోడ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. వీరికి తొమ్మిదేళ్ల క్రితం వివాహమయ్యింది. ఇద్దరు కూతుర్లు, ఒక కుమారుడు సంతానం. రెండు వారాల క్రితం మగబిడ్డకు జన్మనిచ్చింది. ప్రసవం తర్వాత తీవ్ర అనారోగ్యానికి గురై ఆదివారం మృతిచెందింది. భర్త నబీసాహెబ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఒకటవ పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సున్నిపెంటకు పట్టం

శ్రీశైల మండల కేంద్రంగా సున్నిపెంట గ్రామానికి పేరున్నా అనధికారమే. సున్నిపెంట పేరుతో కార్యకలాపాలు కొనసాగుతున్నా గెజిట్ నోటిఫికేషన్‌లో సున్నిపెంట పేరు లేకపోవడంతో ఇక్కడి ప్రజల తీవ్ర ఇబ్బందులు పడేవారు. సమస్యను గుర్తించిన దివంగత నేత వైఎస్సార్ సున్నిపెంటను గ్రామ పంచాయతీ చేస్తూ 2006 జీఓను విడుదల చేశారు. గృహాలపై కూడా హక్కును కల్పిస్తూ 2009 మరో జీఓ నెం.21ను విడుదలచేశారు. అయితే అప్పటి పాలకుల నిర్లక్ష్యం వల్ల పూర్తిస్థాయిలో కార్యరూపం దాల్చకపోవడంతో 2019లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత జగనన్న సాయంతో ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి పూర్తి స్థాయి పంచాయతీగా సున్నిపెంటకు పట్టంగట్టి అభివృద్ధికి బాటలు వేశారు.

- వైఎస్సార్‌సీపీ పాలనలో పంచాయతీగా గుర్తింపు
- వైద్యం, విద్య, తాగునీటి సదుపాయాల కల్పన
- ఇళ్లపై సర్వహక్కులు కల్పించేందుకు చర్యలు



సున్నిపెంటలో వైద్యసేవలు అందిస్తున్న వైఎస్‌ఆర్ హెల్త్ క్లినిక్



ఓ వీధిలో వేసిన సిమెంట్ కాంక్రీట్ రోడ్డు

శ్రీశైలం ప్రాజెక్ట్: శ్రీశైలం మండలంగా, మండల కేంద్రంగా సున్నిపెంట గ్రామాన్ని పిలుస్తున్నప్పటికీ 59 ఏళ్లుగా గెజిట్ నోటిఫికేషన్‌లో మాత్రం లేదు. శ్రీశైలం ప్రముఖ పుణ్యక్షేత్రం కావడంతో అక్కడి పరిపాలన దేవదాయ, ధర్మదాయ శాఖ పరిధిలో ఉండేది. ఉమ్మడి కర్నూలు జిల్లా ఆత్మకూరు మండలం వెంకటాపురం గ్రామ పంచాయతీలో మజారా గ్రామాలుగా శ్రీశైలాన్ని మినహాయిస్తే సున్నిపెంట, లింగాలగట్టు గ్రామాలు 59 ఏళ్ల వరకు కొనసాగాయి. 2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడటం, ఎమ్మెల్యేగా శిల్పా చక్రపాణిరెడ్డి రావడంతో అభివృద్ధికి బాటలు పడ్డాయి. ఆయన జగనన్న దృష్టికి తీసుకెళ్లి 2023 సున్నిపెంటను పూర్తి స్థాయి గ్రామపంచాయతీగా ప్రకటిస్తూ మే 11న జీఓ నెం.40 విడుదల చేశారు. 208.74 ఎకరాల్లో ఉన్న సున్నిపెంట గ్రామ పరిపాలనను పంచాయితీ రాజ్ శాఖకు అప్పగించారు. వీధుల్లో ఎల్‌ఈడీ కాంతులు, తాగునీటి సరఫరా మెరుగు పరిచేందుకు అదనపు మోటార్లు, పైప్‌లైన్‌లు, ఓవర్‌హెడ్‌ట్యాంకుల నిర్మాణం, అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణాలు, పారిశుద్ధ్య పనులు, గ్రామ వలంటీర్లు, సచివాలయ సిబ్బంది పౌరసేవలు శ్రీశైలం, సున్నిపెంట, లింగాలగట్టు గ్రామాల్లో అభివృద్ధిని ఉరకలెత్తించాయి.

యాజమాన్య హక్కులకు కోడ్ బ్రేక్..

1963లో డ్యాం నిర్మాణం కోసం వివిధ ప్రాంతాల నుంచి సున్నిపెంటకు వచ్చిన ప్రజలు ఇక్కడే ఉండిపోయారు. ఉన్న ఊళ్లను వదుకొని వచ్చి శిథిలావస్థలో ఉన్న ప్రభుత్వ గృహాల్లో కొందరు, ప్రభుత్వ స్థలాల్లో చిన్నచిన్న నివాసాలు ఏర్పాటు చేసుకుని మరికొందరు జీవనం సాగిస్తున్నారు. అయితే వీరు ఏళ్లుగా ఉంటున్నా.. ఇళ్లపై, స్థలాలపై యాజమాన్య హక్కులు లేవు. ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి విషయాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో చర్చించి యాజమాన్య హక్కులు కల్పించేందుకు ప్రయత్నించారు. 6 నెలల క్రితం నంద్యాల జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లా పంచాయతీ అధికారులు, సచివాలయ ఉద్యోగులు, సర్వేయర్లు ఇంటింటి సర్వే కూడా నిర్వహించారు. ఎవరి ఇళ్ల వారికి రిజిస్ట్రేషన్ చేయించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్న సమయంలో ఎన్నికల కోడ్ రావడంతో ప్రక్రియ ఆగిపోయింది.

తండ్రి హయాంలో అడుగులు..

శ్రీశైలం మండల కేంద్రమైన సున్నిపెంట గ్రామ పంచాయతీ కోసం గతంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో అడుగులు పడ్డాయి. 2006 జనవరి 1న జీఓ నెం.02ను విడుదల చేశారు. అలాగే గృహాలపై హక్కును కల్పిస్తూ 2009 ఫిబ్రవరి 5న మరో జీఓ నెం.21ను విడుదచేశారు. ఈ జీఓ ప్రకారం శిథిలావస్థలో ఉన్న ప్రభుత్వగృహాల్లో నివశిస్తున్న పేదలు, రిటైర్డ్ ఉద్యోగులకు వాటిపై యాజమాన్యహక్కులు లభిస్తాయి. అయితే అప్పటి పాలకుల నిర్లక్ష్యం వల్ల నివాసితులకు యాజమాన్య హక్కుల ప్రక్రియ కార్యరూపం దాల్చకపోవడంతో పాటు పరిపాలనా సౌలభ్యం కారణాలు సాకుగా చూపుతూ 2013 మార్చి 26న జీఓ నెం.02పై స్టే విధించారు. అయితే తండ్రి వేసిన దారిలో తనయుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పయనిస్తున్నారు. జీఓ నెం.40 తీసుకురావడంతో త్వరలో ఈ ప్రాంత ప్రజలకు యాజమాన్య హక్కులు లభించబోతున్నాయి.

మా ఇల్లు రికార్డులో ఎక్కించారు



6 నెలల క్రితం సున్నిపెంటలో సర్వే నిర్వహించారు. వ్యాపార రీత్యా మా తండ్రి కాలం నుంచి ఇక్కడే స్థిరపడ్డాం. ప్రభుత్వ స్థలంలో అలాట్‌మెంట్‌తో నిర్మించుకున్న మా ఇంటిని ప్రభుత్వం సర్వే చేసింది. మాకు యాజమాన్య హక్కులు కల్పిస్తే సంతోషిస్తాం.

– ఎస్వీఎస్ మల్లికార్జున, బీజేపీ మండల నాయకులు

ఎన్నో ఏళ్ల కల



ఎన్నో ఏళ్ల కలను జగనన్న సాకారం చేయబోతున్నాడు. దివంగత నేత వైఎస్ రాజశేఖర రెడ్డి పేదలు, రిటైర్డ్ ఉద్యోగులు నివశిస్తున్న పాడుబడ్డ ప్రభుత్వ గృహాలను వారికే ఇవ్వాలని నిర్ణయించినా అప్పుడు సాధ్య పడలేదు. ఆయన కొడుకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విడుదల చేసిన జీఓ 40 వల్ల త్వరలో యాజమాన్య హక్కులు పొందబోతున్నాం.

– కత్తుల. కోటేశ్వరరావు, రిటైర్డ్ ఉద్యోగి

మున్సిపల్ ఛైర్మన్‌గా బలిజలకే అవకాశం



మాట్లాడుతున్న మాజీ మంత్రి శిల్పా మోహన్‌రెడ్డి



సమావేశానికి భారీ సంఖ్యలో హాజరైన బలిజ కులస్తులు

బొమ్మలసత్రం: వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వస్తే మున్సిపల్ ఛైర్మన్‌గా బలిజ కులస్తులకే అవకావం కల్పిస్తామని మాజీ మంత్రి శిల్పా మోహన్‌రెడ్డి అన్నారు. స్థానిక సౌజన్యా ఫంక్షన్ హాలులో సోమవారం నిర్వహించిన బలిజ సంఘీయుల ఆత్మీయ సమావేశానికి మాజీ మంత్రితో పాటు, వైఎస్సార్‌సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు పోచా బ్రహ్మానందరెడ్డి, శిల్పారవిచంద్రకిషోర్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా, శాంతిరామ్ విద్యాసంస్థల అధినేత మిద్దె శివరామ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మాట్లాడుతూ.. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని సామాజిక వర్గాల వారికి ప్రాధన్యత కల్పించారన్నారు. కాపు నేస్తం కింద వారి అభివృద్ధికి దోహదపడ్డారన్నారు. శిల్పా కుటుంబం మాట ఇస్తే తప్పేది లేదన్నారు. ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఛైర్మన్‌గా బలిజలకు అవకాశం కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే శిల్పారవి మాట్లాడుతూ.. బలిజ సంఘీయులు ఐక్యమత్యంగా ఉంటూ వైఎస్సార్‌సీపీని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు.

ఆధారాలతో నిరూపిస్తే నీకే రాసిస్తా

- చంద్రబాబుకు కాటసాని సవాల్



మాట్లాడుతున్న కాటసాని రాంభూపాల్‌రెడ్డి

గడివేముల: తాను గానీ, తన కుటుంబ సభ్యులు ఎక్కడైనా సెంటు భూమిని కబ్జా చేశామని ఆధారాలతో నిరూపిస్తే ఆ ఆస్తులన్నీ రాసిస్తానని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి చంద్రబాబు నాయుడుకు సవాల్ విసిరారు. సోమవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా గడివేముల మండలం మంచాలకట్ట గ్రామంలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా తనపై కల్లూరులో చంద్రబాబునాయుడు చేసిన ఆరోపణలపై స్పందించారు. తాను భూములు కబ్జా చేశానని నిరూపిస్తే దేనికైనా సిద్ధం అన్నారు. తన సవాల్‌ను స్వీకరించే దమ్మూ ధైర్యం చంద్రబాబుకు ఉందా? అని నిలదీశారు. రాజకీయంగా తనను ఎదుర్కోలేక తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. ఇష్టమొచ్చినట్లు మాట్లాడితే సహించేది లేదన్నారు. ఎవరో స్క్రిప్టు రాసిస్తే చదవడం చంద్రబాబుకు మంచి పద్ధతి కాదన్నారు.

వక్ఫ్ భూములతో సంబంధం లేదు

పాణ్యం మండలంలోని వక్ఫ్ బోర్డు భూములతో తనకెలాంటి సంబంధం లేదన్నారు. ఒక వ్యక్తిని విమర్శించేటప్పుడు మనమెంత నిజాయతీపరులమో చూసుకోవాలన్నారు. నంద్యాల టీడీపీ ఎంపీ అభ్యర్థి బైరెడ్డి శబరి తనను విమర్శించే స్థాయి కాదని హితవుపలికారు. గతంలో ''మీ నాన్న చేసిన అరాచకాలను ఒక్కసారి చూడమ్మా శబరి.. ప్రొద్దున లేచినప్పటి నుంచి మంది సొమ్ములపై ఆధారపడే మీరు నన్ను విమర్శించే వారు కాదని'' ధ్వజమెత్తారు. 2014 నుంచి 2019 వరకు బినామీ పేర్లతో తెలుగుదేశం పార్టీ నాయకులు ఏం చేశారో తనకు తెలుసన్నారు. తమ దగ్గర అన్నీ ఆధారాలు ఉన్నాయని తెలిపారు. 2019లో పూడ్చర్లలో ఎవరెవరి బినామీల పేర్ల కింద ఎంత భూమి ఉందో గుర్తించాలని ముఖ్యమంత్రికి కూడా జాబితా ఇచ్చానన్నాను.

తీరని పింఛన్ కష్టాలు

- పింఛన్ సొమ్ము కోసం బ్యాంక్‌ల చుట్టూ వృద్ధుల ప్రదక్షిణ
- నేటికీ తీరని సమస్య.. చేతికందని నగదు



ఆధార్ లింక్ కోసం హొళగుంద ఎస్‌బీఐ వద్ద వచ్చిన లబ్ధిదారులు

హొళగుంద: పింఛన్ కష్టాలు ఇంకా తీరడం లేదు. పింఛన్ సొమ్ము బ్యాంక్‌ల్లో జమ చేయడంతో పలువురు వృద్ధుల ఖాతాలకు ఆధార్ లింక్ కాకపోవడంతో సొమ్ము జమకాలేదు. దీంతో ఎండలో బ్యాంక్‌ల చుట్టూ తిరుగుతున్నారు. ఆయా బ్యాంక్‌ల వద్ద ఆధార్ లింక్ కోసం గంటల తరబడి నిరీక్షిస్తున్నారు. మండలంలో మొత్తం 6,115 పింఛన్‌లు ఉండగా 1,291 మందికి ఇంటి వద్దకు అందజేశారు. మిగిలిన 4,824 మందికి ఖాతాలో జమయ్యాయి.

ఇంటివద్దకే వచ్చి ఇచ్చేవాళ్లు

రాజకీయ కక్షలు ఉంటే వారు వారు చూసుకోవాలి. మాలాంటి వారి జీవితాలతో ఎందుకు ఆటలాడుతున్నారు. ఇన్ని రోజులు వలంటీర్లు పింఛన్లను ఇంటి వద్దకు వచ్చి ఇచ్చేవారు. ఎంతో ఆనందంగా ఉన్నాం. ఎవడో ఫిర్యాదు చేశాడని మమ్మల్ని ఇబ్బందులు పెడతారా? మండే ఎండలో బ్యాంకుల చుట్టూ తిరిగేలా చేస్తున్నారు. ఎప్పుడు లేనంతగా ఈ ఏడాది ఎండలు విపరీతంగా ఉన్నాయి. నడిచి రావాలంటే భయమేస్తుంది. మాకేమైన అయితే ఎవరు బాధ్యులు.– గాదిలింగ, హొళగుంద

12 కి.మీ నుంచి బైక్‌పై వచ్చాను

మాకు ఇన్నాళ్లు బ్యాంక్ అకౌంట్లతో పని లేకపోయింది. చాలా ఏళ్లుగా ఖాతాలు ఎలా ఉన్నాయో చూసుకోలేదు. ఇప్పుడు పింఛన్ డబ్బులు అకౌంట్‌లో వేయడంతో గజ్జహళ్లి నుంచి 12 కి.మీ దూరంలో ఉన్న హొళగుందకు మనవడి వెంట పెట్టుకుని మూడు రోజులుగా బైక్‌పై వస్తున్నా. అయినా ఇంకా సమస్య తీరలేదు. ఆధార్ లింక్ కాలేదని చెబుతున్నారు. గజ్జహళ్లి నుంచి హొళగుందకు బస్సులు లేవు. కూర్చోవడానికి, నడవడానికి ఇబ్బంది పడ్తున్న నేను రోజు ఎండలో బైక్ పై రాలేక నరకం అనుభవిస్తున్నా. ఈ వయసులో ఇంత కష్టపెట్టడం మంచిది కాదు. – ఈరమ్మ, గజ్జహళ్లి

తవ్వుకో.. అమ్ముకో

- టీడీపీ నేత మొరుసు దందా
- బి.శివరాంపురంలో అడ్డగోలుగా మొరుసు తవ్వకాలు
- తాగునీటి కుంట మట్టిని అమ్ముకుంటున్న వైనం
- టిప్పర్లు, ట్రాక్టర్ల ద్వారా తరలింపు
- రోజుకు రూ.లక్ష ఆదాయం పైమాటే
- చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్న అధికారులు



ట్రాక్టర్లకు మట్టి నింపుతున్న జేసీబీ



ట్రాక్టర్‌లో తరలిస్తున్న మట్టి

నంద్యాల(అర్బన్): అతనొక తెలుగుదేశం పార్టీ నంద్యాల మండలం మిట్నాల గ్రామం ఎంపీటీసీ భర్త. మిట్నాల పంచాయతీ మజరా గ్రామం ఏ.శివరాంపురంకు చెందిన వ్యక్తి. పక్కనే ఉన్న బి.శివరాంపురం గ్రామంలోని తాగునీటి కుంట వెడల్పు చేస్తున్నామంటూ కుంటను తవ్వి మట్టి అమ్మకాలకు తెర లేపాడు. కొంత మట్టిని కుంట కట్టకు తరలించి లోపల ఉన్న మొరుసు మట్టిని టిప్పర్లు, ట్రాక్టర్ల ద్వారా అమ్మకాలు సాగిస్తున్నాడు. ఒక్కో టిప్పరు రూ.2వేలు, ట్రాక్టర్‌కు రూ.500 చొప్పున అమ్మకాలు జరుపుతూ రోజుకు రూ.లక్షల్లో ఆదాయం గడిస్తున్నాడు. గ్రామంలో అధిక లోడుతో టిప్పర్లు తిరుగుతుదండటంతో సీసీ రోడ్లు ప గుల్లిస్తున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తాగునీటి కుంట కథ

ఐదు దశాబ్దాల క్రితం కోస్తా ప్రాంతం నుంచి వలస వచ్చిన కొందరు రైతులు బి.శివరాంపురంలో గుడిసెలు ఏర్పాటు చేసుకుని నివాసం ఉండేవారు. కాల క్రమేణ – కొట్టాలగా పిలువబడేది. తాగునీటి కోసం గ్రామస్తులు సర్వేనెం.61లోని 1.35ఎకరాల భూమిని ఓ రైతు వద్ద నుంచి కొనుగోలు చేసి కుంటను నిర్మించారు. కుంట సమీపంలో దేవాలయం, ఓహెచ్ ఎస్‌ఆర్ ట్యాంకు నిర్మించారు. కుంట నీటిని ట్యాంకుకు నింపుకుని కుళాయిల ద్వారా గ్రామస్తులకు సరఫరా చేసేవారు. కుంట నీరు గ్రామస్తులకు సరిపోవడం లేదన్న సాకుతో స్థానిక టీడీపీ నేత గత ఏడాది కాలంగా కుంటకు నీటి సరఫరాను నిలిపివేశాడు. పంచాయతీ అధికారులు ఏ.శివరాంపురం నుంచి నీటిని సరఫరా చేస్తూ గ్రామస్తులకు అందిస్తున్నారు. ఈ క్రమంలో టీడీపీ నాయకుడు కుంటను వెడల్పు చేస్తున్నామంటూ గ్రామస్తులను నమ్మించి మొరుసు అమ్మకాలకు తెరలేపాడు.

ఇదీ సంగతి

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో రూ.10లక్షల ఎన్‌ఆర్ ఈజీఎస్ నిధులతో కుంట మరమ్మతులు చేపట్టారు. అంతకు మునుపు రూ.3లక్షలు పంచాయతీ నిధులు వెచ్చించి కుంట కట్ట ఎత్తును పెంచారు. అయితే కుంట గ్రామ పంచాయతీకి సంబంధం కాదంటూ కొందరు స్థానిక టీడీపీ నాయకులు అక్రమ మార్గాల్లో మట్టి తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

పంచాయతీ తీర్మానం లేకుండానే..

గ్రామ పంచాయతీ ద్వారానే నీటి సరఫరా అవుతుండటమే కాకుండా కుంటకు సంబంధించిన అన్ని రకాల పనులను పంచాయతీ తీర్మానాల ద్వారా చేస్తూ వచ్చారు. గతంలో రూ.లక్షల ప్రభుత్వ నిధులు వెచ్చించి తాగునీటి కుంట పనులు చేపట్టారు. గత ఏడాది కాలంగా కుంటకు నీటి సరఫరాను నిలిపి వేసి పంచాయతీ తీర్మాణాలేవి లేకుండానే టీడీపీ నాయకులు కుంటను తవ్వడం, మట్టి అమ్మకాలు సాగించడంపై పలువురు విమర్శలు చేస్తున్నారు.

ఉదాసీనంగా వ్యవహరిస్తున్న అధికారులు

తాగునీటి కుంట మట్టి తరలింపుపై పంచాయతీ అధికారులతో పాటు రెవెన్యూ అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మట్టి తరలిస్తూ లక్షలు ఆర్జిస్తున్నా రెవెన్యూ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు ఉన్నారని, పంచాయతీ తీర్మానం లేకుండా కుంట మట్టిని తరలిస్తున్నారన్న సమాచారం తెలిసినా పంచాయతీ అధికారులు మాత్రం ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

మట్టి తరలింపును అడ్డుకుంటాం

కుంట మట్టిని ఇతర ప్రాంతాలకు తరలించడం నేరం. మట్టి తరలింపును అడ్డుకుంటాం. కుంటను వెడల్పు చేయడం సరైనదే అయినా మట్టిని అమ్మితే చర్యలు తీసుకుంటాం.

–చంద్రశేఖర్‌రెడ్డి, తహసీల్దార్, నంద్యాల

ఆరోగ్య ధీమా

- ఆరోగ్యశ్రీతో నిలబడుతున్న పేదల ప్రాణాలు
- జిల్లాలో 124 నెట్‌వర్క్ ఆస్పత్రులు
- 6,49,493 ఆరోగ్యశ్రీ హెల్త్‌కార్డులు
- 3,257 వ్యాధులకు చికిత్స
- గత ప్రభుత్వంలో 1800 వ్యాధులకు మాత్రమే
- గత ఐదేళ్లలో 2,98,929 మందికి ఆరోగ్యశ్రీలో చికిత్స
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కొత్తగా రోగులకు ఆసరా
- 2,10,542 మంది లబ్ధిదారులకు రూ.118.67 కోట్లు జమ

ఆరోగ్యం బాగాలేకపోతే పేదవాడికి ప్రభుత్వ ఆస్పత్రే దిక్కు. ప్రైవేటు, కార్పొరేట్ ఆస్పత్రుల మెట్లెక్కాలంటే జేబు నిండుగా డబ్బు ఉండాల్సిందే. లేదంటే అప్పులు చేసి చికిత్స చేయించాల్సిన పరిస్థితి. ఇదంతా గతం. ఆరోగ్యశ్రీ పథకం వచ్చాక ఈ పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. ఆరోగ్యశ్రీ కార్డు జేబులో ఉంటే చాలు ఎంత పెద్ద కార్పొరేట్ ఆస్పత్రి అయినా ధైర్యంగా వెళ్లి ఉచితంగా చికిత్స చేసుకునే వెసులుబాటు వచ్చింది. ఈ పథకం కారణంగా ఏటా వందలాది ప్రాణాలు నిలబడుతున్నాయి. వేలాది కుటుంబాలు వైద్యం కారణంగా అప్పుల పాలు కాకుండా ఉంటున్నాయి.



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులు(ఫైల్)

కర్నూలు(హాస్పిటల్): పేదల ఆరోగ్యానికి ఆరోగ్యశ్రీ కొండంత భరోసా ఇస్తోంది. ఈ కార్డు ద్వారా ఏ వ్యాధికైనా కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఉచితంగా చికిత్స చేసుకుంటున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 2008లో అప్పటి ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రారంభించారు. అప్పటి వరకు కార్పొరేట్ హాస్పిటల్ అంటే ఏమిటో కూడా తెలియని పేదవారు సైతం ప్రైవేటు ఆస్పత్రి భవనం మెట్టు తొక్కడమే కాకుండా ఆరోగ్యశ్రీ కార్డు జేబులో పెట్టుకుని దర్జాగా చికిత్స పొందుతున్నారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు లక్షలాది మంది పేద, మధ్యతరగతి వారు ఈ పథకం ద్వారా లబ్ధి పొందారు. ఆయన తదనంతరం వచ్చిన ముఖ్యమంత్రులు పథకాన్ని నీరుగార్చే ప్రయత్నం చేశారు. పథకాన్ని పూర్తిగా తీసేసే సాహసం కూడా చేశారు. పథకం అమలులో పలు రకాల ఆంక్షలు పెడుతూ పేదలకు క్రమంగా దూరం చేసే ప్రయత్నం చేశారు. ఐదేళ్ల క్రితం అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆరోగ్యశ్రీ పథకానికి పూర్వవైభవం తీసుకురావడమే గాక మరింత గొప్పగా తీర్చిదిద్దారు. ఐదేళ్ల క్రితం కేవలం 1800లోపు ఉన్న చికిత్సలను ఇప్పుడు 3,257కు పెంచారు. అంతేగాక ఇతర రాష్ట్రాల వారు ఎవ్వరైనా ఇక్కడ రోడ్డు ప్రమాదానికి గురైతే వారికి ఏ ఆస్పత్రిలోనైనా ఉచితంగా చికిత్స అందించే ఏర్పాట్లు చేశారు. గత ప్రభుత్వ హయాంలో 2014–19 వరకు 89,561 మందికి చికిత్స అందించగా రూ.210.57 కోట్లను క్లెయిమ్‌గా అందించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక 2019 నుంచి ఇప్ప టి వరకు 2,98,929 మందికి చికిత్స అందించగా ఏ కంగా రూ.605.54 కోట్లను క్లెయిమ్‌గా అందించింది.

ఐదేళ్లలో 2.89 లక్షల మందికి చికిత్స

జిల్లాలో ప్రస్తుతం వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం అమలు చేస్తున్న నెట్‌వర్క్ ఆస్పత్రులు 124 ఉన్నాయి. ఇందులో 42 ప్రభుత్వ, 53 ప్రైవేటు, 29 డెంటల్ హాస్పిటల్స్ ఉన్నాయి. వీటిని పర్యవేక్షించేందుకు ఒక డిస్ట్రిక్ట్ కో–ఆర్డినేటర్, ఒక డిస్ట్రిక్ట్ మేనేజర్, ఏడుగురు నెట్‌వర్క్ టీమ్ లీడర్లు, ఇద్దరు ఆఫీస్ అసోసియేట్స్, 175 మంది ఆరోగ్యమిత్రలు విధులు నిర్వహిస్తున్నారు. గత ఐదేళ్ల కాలంలో 2,89,125 మంది చికిత్స తీసుకోగా రూ.586.5 కోట్లను ఆస్పత్రులు క్లెయిమ్ చేసుకున్నాయి. అంతేగాక ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఆస్పత్రుల్లో చికిత్స పొంది డిశ్చార్జ్ అయి ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న వారికి ఆర్థిక భరోసా కోసం డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య ఆసర పథకాన్ని అమలు చేస్తున్నారు. ఈ పథకం ద్వారా ఇప్పటి వరకు 2,06,542 మంది లబ్ధిపొందగా వారి బ్యాంకు ఖాతాల్లో రూ.112.67 కోట్లు జమ అయ్యాయి.

ఐదేళ్లలో ఆరోగ్యశ్రీ వివరాలు

సంవత్సరం	నిర్వహించిన చికిత్సలు	క్లెయిమ్ (రూ.కోట్లలో)	ఆసరా లబ్ధిదారులు	క్లెయిమ్ (రూ.కోట్లలో)
2019-20	35,819	78.21	8,527	4.59
2020-21	42,325	99.66	33,489	17.05
2021-22	53,459	106.05	45,705	25.1
2022-23	60,361	119.13	45,518	25.02
2023-24	1,08,965	202.49	83,303	46.91
మొత్తం	2,98,929	605.54	2,10,542	118.67

పేదలకు వరం



నేను ట్రాన్స్‌పోర్ట్ విభాగంలో పనిచేస్తాను. నాకు ఇటీవల గుండెపోటు వచ్చింది. కుటుంబ సభ్యులు వెంటనే కర్నూలు గాయత్రి ఎస్టేట్‌లోని విశ్వభారతి హాస్పిటల్‌లో చేర్పించారు. వైద్యులు పరీక్షలు నిర్వహించి గుండెలో రెండు నాళాలు బ్లాక్ అయ్యాయని తేల్చారు. 20 రోజుల క్రితం నాకు బైపాస్ సర్జరీ నిర్వహించారు. ఇటీవలే డిశ్చార్జ్ అయ్యాను. ఇలాంటి పథకం లేకపోతే చికిత్స కోసం అప్పు చేయాల్సి వచ్చేది. ముఖ్యమంత్రి జగన్ అన్నకు కృతజ్ఞతలు.

–వెంకటరమణారెడ్డి, ఆత్మకూరు మండలం, నంద్యాల జిల్లా

ఆరోగ్యశ్రీతో ఎంతో మేలు



నేను తాపీ మేస్త్రీని. కడుపు నొప్పితో కర్నూలు అమ్మ హాస్పిటల్‌లో చేరితే డాక్టర్లు పరీక్షించి కిడ్నీలో రాళ్లు ఉన్నాయని నిర్ధారించారు. ఈ ఏడాది ఫిబ్రవరి 19న రాళ్లు తీశారు. ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యాక నా బ్యాంకు ఖాతాలో ఆసరా కింద రూ.3 వేలు నగదు జమ అయ్యింది. రోజువారీ పనులు చేసుకునే మాలాంటి వారికి ఆరోగ్యశ్రీ ఆదుకుంటోంది.

–షేక్ అబ్దుల్ గఫార్, మండ్లెం గ్రామం, జూపాడుబంగ్లా, నంద్యాల జిల్లా